# శ్రుతి - అపశ్రుతి

"ఇన్నాళ్లూ ఊరుకుని ఇప్పుడు ఒక్కసారిగా తొందరపడుతున్నదేం మీ నిర్మల ?" నవ్వుతూ అన్నాను.

"ఛ! దానిదేం లేదండీ, అంతా మా అమ్మా, నాన్నలదే. దాని ముఖం దానికేమైనా అసలు తెలిస్తే కదా?" అన్నది పార్వతి చెల్లెల్ని వెనకేసుకొస్తూ.

రైలు వేగంగా పరుగులు తీస్తున్నది. చెట్లూ చేమలూ హడావిడిగా వెనక్కి పరుగెత్తున్నాయి. పచ్చటి పొలాల్లోని నల్లని పడుచులు ఒయ్యారంగా నుంచుని దీక్షగా చూస్తున్నారు ఇటే. సూర్యకిరణాలు పడి పక్కన ఉన్న నీళ్లు తళతళా మెరుస్తున్నాయి.

ఆ మిలమిలలు పార్వతి ఎత్తయిన ఎర్రటి బుగ్గల మీద పడి మెరుస్తుంటే గమ్మత్తుగా ఉంది. పార్వతి బాగుంటుంది. పార్వతి ముక్కు మరీ బాగుంటుంది. సన్నగా నునుపుదేరి కవ్విస్తూ ఉంటుంది. ఆ అందమేనేమో నన్ను ఆమెను చూసిన మరుక్షణంలోనే పరవశుణ్ణి చేసి ఆమె వశం చేసింది.

"పార్వతీ, నువ్వు ఇప్పుడు ఎంత బాగున్నావో తెలుసా? తామరాకు మీద తళ తళా..." నెమ్మదిగా, రహస్యంగా అంటున్న నా నోటికి తాళం వేసింది.

"ష్!... ఇది మన ఇల్లు కాదు. పెద్దగా అరిచేస్తారేం? అంతా వింటున్నారు మీ మాటలే!"

"ఆ! విననీ, డియర్! నేర్చుకుంటారు."

"ఆహా! మీ మాటలే నేర్చుకోవాలి. ఇక బాగుపడినట్టే" అన్నది పార్వతి చిలిపిగా చూస్తూ.

ఆమె ముఖం చూస్తే ముచ్చట వేసింది. అలా దోసిట్లో దాచుకోవాలనిపించింది. అయినా ఊరుకున్నాను.

ఎప్పుడూ మెల్లగా పోయే ట్రెయిన్ ఈ రోజెందుకో వేగంగా పోతున్నది.

పక్కనే తాటిచెట్టు కింది ఎవడో కూర్చుని ఏదో తాగుతున్నాడు.

"ఏమండోయ్! ఇటు చూడండి!" మోచేత్తో పొడుస్తూ అంది పార్వతి.

"ఏం?"

"వాడు చూడండి - ఇందాకటినించీ నన్నే తెగ చూస్తున్నాడు తినేసేలా. కోరచూపులూ వాడూను" ఎవ్వరికీ వినపడకుండా మెల్లగా అన్నది పార్వతి.

పార్వతి చూపించినది, నా కెదురు సీటులో కూర్చున్న పాతికేళ్ల కుర్రాడిని. నేనూ అటు చూశాను. అతను దీక్షగా కిటికీలోనించి బయటకు చూస్తున్నాడు.

"ఏమిటి, పార్వతీ, అతనెటో చూస్తుంటే నిన్నే చూస్తున్నాడని అంటావేం?"

"ఆఁ! వాడివన్నీ పిచ్చి వేషాలు. ఇందాకటి నుంచీ కన్నార్పకుండా నా వేపే తినేసేలా చూస్తున్నాడు. మీతో చెప్పేసరికి భయపడి అటు తిరిగాడు. ఫూల్!" పార్వతి విసుగ్గా అంది.

"ఊఁ! పోనీలే. ఇప్పుడు చూడటం లేదుగా!" మళ్లీ ప్రకృతిని చూడటంలో మునిగిపోయాను.

ఏపుగా పెరిగిన పైరు చల్లగాలికి తల వంచుకుని కొత్త పెళ్లికూతురిలా సిగ్గుపడుతున్నది. నీలాకాశంలో తెల్లటి మబ్బులు అందమైన కన్నెపిల్ల నున్నటి శరీరం మీద జార్జెట్ చీరలాగ మెత్తగా జారిపోతున్నాయి.

మళ్లీ మోచేత్తో పొడిచింది పార్వతి - "ఏమండీ!" అంటూ.

ఈసారి కొంచెం గట్టిగానే చేయి ఝాడించిందేమో కడుపులో ఏదో కలుక్కుమంది.

"ఏమిటి, పార్వతీ?" బాధగా అన్నాను.

"వాడు చూడండి - బాటసారిలా కళ్లజోడూ వాడూను. మిర్రి మిర్రి చూస్తున్నాడు - జీవితంలో ఎన్నడూ ఆడపిల్లల్ని చూడనట్టుగా, వట్టి మేనర్‌లెస్ బ్రూట్!" కొంచెం కోపంగానే అయినా నెమ్మదిగా అన్నది.

అటు చూశాను. అతను మా వేపే చూస్తున్నాడు. చూపు మామూలుగానే ఉంది.

"ఏమిటి, పార్వతీ, అతను ఎంతసేపని కిటికీలోంచి బయటకు చూస్తాడు? కాసేపు ఇటు తిరిగితే అంతలో ఏమయింది? పైగా అతను మామూలుగానే చూస్తున్నాడే! నాకేమీ చెడుగా అనిపించటం లేదు."

"అవున్లేండి! మీ కంతే!" మూతి ముడుచుకున్నది పార్వతి.

ఆ పోజంటే నాకు మహా ఇష్టం. కాని..... ఊరుకున్నాను.

"లాల్‌బహదూర్ శాస్త్రిగారిని హత్యచేశారట, సార్. అది మామూలు చావు కాదట!" నల్లగా, లావుగా ఉన్నాయన సిగరెట్టు వెలిగిస్తూ అన్నాడు.

అసలు సిగరెట్టు ఆరోగ్యానికి ఏమీ మంచిది కాదట. మరి ఈయన సిగరెట్టు మీద సిగరెట్టు తాగుతాడేం! ఆత్మహత్యా ప్రయత్నం చేయటం లేదు కదా కొంపతీసి.

"లేదండీ! లాల్ బహదూర్ మరణం సహజమైనదే. ఏమాత్రం అనుమానమున్నా మనవాళ్లు ఊరుకునేవాళ్లు కారు!" స్టూడెంటు కుర్రాడు అంటున్నాడు.

ఈ స్టూడెంటు కుర్రాడు ప్రభుత్వపు పార్టీ కాబోలు. ఏమయితేనేం? ఈ మధ్య స్టూడెంట్లు పాలిటిక్స్‌లో దిగిపోయారు. కామరాజుని ఓడించింది కూడా ఓ స్టూడెంటు కుర్రాడేగదా!

పొట్ట దగ్గర ఫెడీమనీ మోగింది. ఈసారి కొంచెం గట్టిగానే మోచేత్తో పొడిచింది మా ఆవిడ.

"అబ్బా" అన్నాను అప్రయత్నంగా.

"మేలుకునే ఉన్నారు గదా! పిలిస్తే పలకరేం? వాడు చూడండి - కోరమీసం వాడూనూ. అసలు నేనటు చూస్తే చాలు తెగ కులుకుతున్నాడు. ఏమిటి వాడి ఉద్దేశ్యం! అసలు ఏమిటి మీ ఉద్దేశ్యం? వాడిని తన్ని తగలేయక మీరు చూస్తూ ఊరుకుంటా రేం?" తీక్షణంగా అంది పార్వతి.

నెమ్మదిగా అన్నాను: "డ్రిల్లు మాస్టర్ని గదా - అరడుగుల శరీరం ఉందని కనపడిన వాడినల్లా తన్నితే ఊరుకోరు, అమ్మడూ!"

"అబ్బ! ఏం తెలివిగా మాట్లాడారండీ! ధైర్యం లేకపోతే చెప్పరాదూ? నేనే నాలుగు దులుపుతాను వాడిని. కొక్కిరాయి క్రాపూ వాడూనూ!"

"అదికాదు, చిట్టీ, చదువుకున్నదానివి నువ్వు కూడా అలా మాట్లాడతావేం! నేను రోడ్డు మీద అమ్మాయిలు కనబడితే చూడనూ?"

మిర్రి మిర్రి చూసింది నన్ను.

"ఆహాఁ! అది కాదు నా ఉద్దేశ్యం. మామూలుగా అలా చూస్తాం - అంతే. అందులో తప్పేమిటీ అంట? ఇహ అతన్నేమని అడుగుతావు? ఏమయ్యా, ఎందుకు నన్నలా చూస్తావ్ అనా? అడుగు- నువ్వు నా వైపు చూస్తేనే గదా నీకు తెలిసింది, నేను నీ వేపు చూస్తున్నానని - అని వాడంటే ఏం చేస్తావ్!" లాలింపుగా అన్నాడు.

"ఆఁ! ఏడిశాడు!" అన్నది పార్వతి.

'ఈ మధ్య తెలుగు సినిమాలు కూడా చప్పగా తయారయాయి, సార్. మళ్ళీ హిందీ సినిమాలే నయం అనిపిస్తున్నాయి. ఏవో నాలుగు మంచి పాటలూ, రంగుల్లో పిక్చరైజేసనూ...!' ఇంకా ఏదో అంటున్నాడు ఇందాకటి స్టూడెంటు.

అవును, బాబూ. మరి హిందీ సినిమాలు మీ కుర్రాళ్లకి అర్థం కావు కదా! రంగుల బొమ్మలు చూసి చప్పట్లు కొట్టేయండి. మంచి పాట వస్తే దానితోపాటు ఈలవేసి మిగతావాళ్లకి బోరు కొట్టించేయండి. అసలు ఇప్పుడు ఇంగ్లీషు, హిందీ సినిమాలు అర్థమవుతాయి అని కాదు చూట్టం. అదో ఫాన్సీ. అర్థంకాని ఇంగ్లీషు సినిమా చూసి "బాగుంది" అన్నవాడే తెలుగు సినిమా చూసి అర్థం చేసుకుని "డర్టీ తెలుగు పిక్చర్స్" అంటున్నాడు.

ఆలోచనల్లోంచి తేరుకుని, చటుక్కున చేయి అడ్డం ఉంచాను, మోచేత్తో పొడవబోతున్న పార్వతిని వారిస్తూ.

"ఆ రాస్కెల్‌ని చూస్తూ ఊరుకుంటారేమండీ? కోతి ముఖం వాడూనూ. ఇందాకనుంచీ..." ఇంకా పార్వతి ఏదో అనబోతూనే ఉన్నది, ట్రెయిన్ బెజవాడ ప్లాట్‌ఫారమ్ మీదికి వచ్చి ఆగింది.

రామ్మూర్తి స్టేషన్‌కి వచ్చాడు. కాసేపు అదీ ఇదీ మాట్లాడాడు.

కళ్లజోడు విలన్ ప్లాట్‌ఫారమ్ మీద తిరుగుతున్నాడు.

రామ్మూర్తి పార్వతితో అన్నాడు: "అక్కయ్యాగారూ, మన నిర్మలని రేపు చూడబోయే అతను అతనే అనుకుంటాను. నేను ఫోటోలో చూడటం వల్ల సరిగ్గా గుర్తులేదు. పరిచయమూ

లేదు."

ఎవరా అని అటు చూసిన పార్వతి కళ్లజోడు విలన్‌ని చూసి ఉలిక్కిపడింది.

"అతనా!" అప్రయత్నంగా అంది.

"అవును! మీ నాన్నగారు నాకు మొన్న కాజువల్‌గా అతని ఫోటో చూపించారు - మా నిర్మలని చూడటానికి వస్తున్నాడు, ఇంజనీర్ అని. మీరు కూడా పెళ్లి చూపులకి వస్తున్నట్టు ఆయనే చెప్పారు. అందుకే మిమ్మల్ని చూద్దామని స్టేషన్‌కి వచ్చాను! ఇంతకీ అతను ఢిల్లీలో పనిచేస్తున్నాట్ట కదా? నెలకి ఏడొందలు వస్తుందనీ, చాలా మంచి వాడనీ చెప్పారు. కట్నం కూడా ఏమీ తీసుకోరట. మంగళగిరిలో వాళ్ల నాన్నగారూ వాళ్లూ ఉంటున్నారనీ, అతను సెలవు పెట్టి వస్తున్నాడనీ చెప్పారు కూడాను."

అదోరకంగా మారిన మా ఆవిడ ముఖం మళ్లీ ఎందుకో వికసించింది.

బెజవాడ స్టేషన్ ఎప్పుడూ సందడిగానే ఉంటుంది. మగవాళ్లతోపాటు ఆడవాళ్లు కూడా ప్లాట్‌ఫారాల మీద అటూ ఇటూ పరుగెత్తుతుంటారు. ఆడవాళ్ళంటే గుర్తుకొచ్చింది. ఈ మధ్య ఈ ఆడవాళ్ల ఫాషన్లు మరీ మితిమీరిపోతున్నాయి. జాకెట్లు మరీ పావుగజంతో కుట్టించేస్తున్నారు. గుడ్డ ఖర్చు తగ్గింది కదా అనుకుంటే కుట్టుకూలి పెరిగిపోయింది. ఇక మధ్యతరగతి వాళ్లం ఏం తింటాం?

మధ్యతరగతి అంటే గుర్తుకు వస్తున్నది. అబ్బ, మూడో క్లాసులో రైలు ప్రయాణం చాలా .....

"ఏమండీ, మిమ్మల్నే!" గట్టిగా కుదిపింది పార్వతి.

"ఏం?"అన్నాను ఆలోచనలలో నించి తేరుకుంటూ. అప్పటికే రైలు బయలుదేరింది. రామ్మూర్తి చేయి ఊపుతున్నాడు. నేనూ చేయి ఊపాను. అసలు ఈ రైలుస్టేషన్లలో చేయి ఊపటం అనేది సరిగ్గా పరిశీలిస్తే గమ్మత్తుగా ఉంటుంది. ఒకసారి ఇలాగే కాకినాడ స్టేషన్లో....

"కూర్చుని నిద్ర పోతున్నారు మళ్లీ ..... ఏమండీ!" తన కాలితో నా కాలిని నెమ్మదిగానే నొక్కుతూ అన్నది పార్వతి.

"ఊఁ! ఏమిటి?" అన్నాను.

"కళ్లజోడు కొంతమందికి చాలా అందాన్నిస్తుంది కదండీ? అతన్ని చూడండి - ఆ కళ్లజోడులో ఎంత ఠీవిగా, హుందాగా ఉన్నాడో! పెద్ద ఫిలాసఫర్‌గా ఉన్నాడు. అచ్చం ఇంగ్లీషు సినిమాలో మైఖేల్ కెయిన్‌లా ఉన్నాడు కదూ?"

కళ్లు తిరిగినట్టయింది. ఏమిటబ్బా, మా ఆవిడేనా అంటున్నది అనుకున్నాను. పార్వతి చేతిని నా చేతిలోకి ప్రేమగా తీసుకున్నాను. చటుక్కున గిల్లాను.

"అబ్బా!" అన్నది బాధగా.

అవును, పార్వతే అంటున్నది!

అఁ మరిచిపోయాను - పార్వతికి ఇంగ్లీషు సినిమాల్లో బొమ్మలు, వాళ్ల పేర్లు అన్నీ బాగా తెలుసు. అందుకే సందు దొరికితే నాలుగు పేర్లు చెప్పేస్తుంది.

"ఏమండీ, మన నిర్మలకి అతను సరియైన జోడి అండీ. పొడుగ్గా, అందంగా గ్రిగెరీ పెక్‌లా ఉన్నాడు గదూ?"

'ఛ! లేడు. లేడంటే నిజంగా లేడని కాదనుకో. మరీ అలా కోపంగా చూడకు నా వేపు. ఊఁ! సరే, ఉన్నాడు. కాని అతనికి కోరమీసాలు, పార్వతీ, కోర మీసంగాళ్ళకి కులుకెక్కువ!' అన్నాను.

"ఎవడండీ అలా కూసింది! కోర మీసమే అసలు అందం. ఒమర్ షరీఫ్ ఎంత బావుంటాడు! మీసం మంచి గంభీరత్వాన్నిస్తుందండీ, మీరు ఉన్నారు ఎందుకు?"

నా అదృష్టం బాగుండి నన్నెవరితోనూ పోల్చలేదు. అసలు మా ఆవిడకి కాలేజీలో చదివేటప్పుడే పేర్లు పెట్టడం అలవాటు. 'ఏపిల్' అని ఒక ఎర్రబుగ్గలమ్మాయికి, 'బుచ్చి' అని ఓ కళ్లజోడబ్బాయికి .... ఇలా....

"ప్లీజ్..." ఏదో అడుగుతున్నాడుమ కళ్లజోడు విలన్.

"ఆఁ! ఏమిటి?" అడిగాను ఆలోచనల్లోంచి తేరుకుంటూ.

ఇంతలో మా ఆవిడ అట్ట దులిపి చేతిలోని నవల అందించింది.

"పుస్తకం" అని పుస్తకం చూడటంలో మునిగిపోయాడతను.

అతన్ని పరీక్షగా చూశాను. నెమ్మదిగా పార్వతితో అన్నాను:

"పార్వతీ, అతనిది కొక్కిరాయి క్రాపు."

"ఏం కాదు. అతని క్రాఫింగ్‌కేం? అందంగా రాక్ హడ్సన్ క్రాఫ్‌లా ఉంటుంది!"

"అయినా అతని ముఖం కోతి ముఖం, పార్వతీ!"

"ఎవరండీ అన్నది! అతని ముఖం అచ్చు టోని కర్టిస్ ముఖంలా బ్యూటిఫుల్‌గా ఉంటుంది!"

"అతను మంచివాడుకాదు, చిట్టీ! ఎప్పుడూ జీవితంలో అమ్మాయిలని చూడనివాడిలా మిర్రిమిర్రి చూస్తాడందర్నీ!"

"ఇంకా నయం! ఎదురుగా కూర్చున్న మనుష్యుల్ని చూడటంలో తప్పేముంది? చూడటానికి కాపోతే , ఆ కళ్లూ, కళ్లజోడూ ఎందుకు?"

సరే. ఇక నే నేమన్నా పార్వతి అతన్ని సమర్థించేస్తుంది. కారణం - అతని పెద్ద ఉద్యోగం, హోదా, అన్నిటికీ మంచి కట్నం అడగడనీ, చాలా మంచివాడనీ రామ్మూర్తి ఇచ్చిన సర్టిఫికేట్.

తీక్షణంగా చూశానతన్ని. మంచి వాడిలాగానే ఉన్నాడు.

పార్వతి వేపు చూశాను. తన చెల్లెలి భర్త కావటానికి అతడికి అన్ని అర్హతలూ ఉన్నాయి అనే అభిప్రాయంతో చాలా సంతోషంగా అతన్ని చూస్తున్నది.

మా ఆవిడ పద్ధతి చూస్తే ఆశ్చర్యం వేసింది. అతన్ని మొదటి నుంచీ అసహ్యించుకుంటూనే ఉన్నది. అతని ప్రతి చేష్టనీ విమర్శిస్తూనే ఉన్నది. తిడేతూనే ఉన్నది. కాని అతను

చాలా మంచివాడనీ, డబ్బు, చదువు, హోదా ఉండటమేగాక, కట్నం తీసుకోడనీ, తన చెల్లెల్ని చూడటానికి వస్తున్నాడనీ తెలియగానే అతన్ని చాలా గౌరవంగా, గొప్పగా చూస్తున్నది. అతని ప్రతి చేష్టనీ పొగుడుతూనే ఉన్నది. మెచ్చుకుంటున్నది. అసలు ఆ మనసు అనేదే అలాటిదేమో! చాలా విచిత్రమైనది. ఒకే వస్తువుని నచ్చితే మెచ్చుకుంటుంది. నచ్చకపోతే తిట్టుకుంటుంది. మనసనేది ఒక వాయిద్యం లాంటిది. వాయించే విధానాన్ని బట్టి ఒకే మనిషి, ఒకే వాయిద్యం మీద శ్రుతులేకాక, అపశ్రుతులు కూడా పలికించగలడు.

''ఢిల్లీలో పెద్ద ఉద్యోగమే చేస్తున్నాట్ట. ఏడొందలు జీతంట. పెద్ద బంగలా, కారూ కూడా ఉండే ఉంటాయి....'' ఏదో చెబుతున్నది మా ఆవిడ.

అవును! కారు కూడా ఉండే ఉంటుంది. కాని పెద్ద కారా, చిన్న కారా? పెద్దదే అవాలి. ఎందుకంటే, చిన్న కారు ప్రాజెక్టు తయారయి, బయటకి రావటానికి ఇంకా ఎన్ని సంవత్సరాలు పడుతుందో మరి! అసలు ఈ చిన్నకారు ప్రాజెక్టు అనేది...

''ఎక్స్‌క్యూజ్‌మి!'' కళ్లజోడు విలన్ (అలా అంటే పార్వతి ఇక ఊరుకోదు కాబోలు) చనువుగా నా ఒళ్లోని పేపరు తీసుకున్నాడు. మా ఆవిడ అంటున్నది నాతో - ''అబ్బ, ఎంత సోషల్‌గా ఉంటాడో చూశారా'' అని.

అతను మొదటి పేజీ చదువుతున్నాడు. చివరి పేజీలో సబ్బుల కంపెనీ ఎడ్వర్‌టైజ్‌మెంటు కనపడుతున్నది. నిజంగా ఈ సినిమా తారలు ఆ సబ్బులు వాడరట. ఊరికే అలా కానీ డబ్బుల కోసం కక్కుర్తి పడి ప్రకటనల్నిస్తారట. ఏమిటో మరి.... కాలం మారిపోతున్నది. అసలు....

'రేపు అతను పెళ్లి చూపులకు వచ్చినప్పుడు మనల్ని చూసి ఆశ్చర్యపోతాడు. అంతా కథలోలాగా ఉందే అనుకుంటాడు కదండీ?'' అంటున్నది పార్వతి.

''అవును!'' అన్నాను. అసలు ఈ మధ్య కథలు అంతగా బాగుండటం లేదు. ఏదో అప్పుడప్పుడూ ఎక్కడో ఒక్క....

ట్రెయిన్ గుడివాడ ప్లాట్‌ఫారమ్ మీద ఆగింది. సూట్‌కేసుతో సహా దిగి, మామగారి కోసం చుట్టూ చూశాను.

''ఏమోయ్, కృష్ణమూర్తీ? ప్రయాణం బాగా జరిగిందా?'' అంటూ వచ్చారు మామగారు.

పార్వతి గబగబా వాళ్ల నాన్న దగ్గరికి వెళ్లింది.

''నాన్నా పెళ్లికొడుకు చాలా బాగున్నాడు. మంచి సంబంధం'' అన్నది.

'నువ్వెప్పుడు చూశావు, అమ్మా, అతన్ని? అతను సెలవు దొరకక ఇంకా రాలేదు. నాలుగు రోజుల్లో వస్తాడు! అందుకే పెళ్లిచూపుల కార్యక్రమం నాలుగు రోజులు వాయిదా....' ఆయన ఏదో చెబుతున్నారు.

ట్రెయిన్ వేపు చూశాను. కళ్లజోడు విలన్ ఇటే చూస్తున్నాడు. పార్వతి వేపు చూశాను.

''కోతి వెధవ! బాటసారి ఫోజూ వాడూనూ! ఈ కొక్కిరాయి బుద్ధులు పోతేకాని వాడు బాగుపడడు!'' అంటున్నది నా పార్వతి.

*